



# మారుతి

## యస్వీ శివాజీ రావ్

దీక్షగా పేపరు చదువుతున్న నాకు, పెరట్లోంచి వినిపిస్తున్న పిల్లల అరుపులకు, కేకలకు కోపం వచ్చింది

ఏమిట్రా ఆ గోల కుర్చీలోంచే గట్టిగా అరిచాను సమాదానంగా మీరోసారి యిలా రండి అన్న శ్రీమతి పిలుపు పెరట్లోనుంచే వినిపించింది

అబ్బబ్బ వచ్చేది ఒక్క ఆదివారం ఆ రోజు కూడ ప్రశాంతంగా గడపనివ్వరు కదా అసహనంగా అరుస్తూ పేపరు మడిచి టీపాయి మీద పెట్టి లేచాను

పెరట్లోకి వెళుతుంటే డైనింగు టేబిలు మీద సగం తిన్న టిఫిన్ ప్లేట్లు, గ్లాసులు గజిబిజిగా కన్పించాయి

టిఫిన్ కూడ తినకుండా ప్రొద్దునే ఏమిట్రా మీ వెదవ గొడవ కోపంగా అరుస్తూ పెరట్లోకి అడుగు పెట్టాను

నన్నూ నా కోపాన్ని ఎవరూ లెక్క పెట్టలేదు ముగ్గురు పిల్లలూ దేనిచుట్టో మూగి, వంగి వంగి చూస్తూ అరుస్తున్నారు వాళ్ళ అరుపులతో పాటు యింకేదో వింత శబ్దాలు కూడ వినిపిస్తున్నాయి

శ్రీమతి దూరంగా నిలుచుని చోద్యం చూస్తోంది వాళ్ళందరినీ అంతగా ఆకట్టుకున్నది ఏమిటో నన్న ఆసక్తితో గబగబా ముందుకు అడుగులు వేసి, పిల్లల మధ్యలోంచి తొంగి చూశాను

అక్కడొక కోతి నేల మీద పడుకొని వుంది! పిల్లలు చేతులలోని సన్నని కఱ్ఱలతో దాన్ని పొడుస్తూ అది [illegible] కష్టం చేస్తుంటే సంతోషంగా కేరింతలు కొడుతున్నారు.

స్వభావానికి విరుద్ధంగా ఒకేచోట ఎందుకు పడుకుని వుంది?

యింకో రెండడుగులు ముందుకు వేసి, పిల్లల్ని పక్కకు నెట్టి పరీక్షగా దాని వంక చూశాను

నేల మీద అది పడుకున్న చోట, కింద ఎఱ్ఱగా తడిగా కనిపించింది - దానికేదో దెబ్బ తగిలినట్టుంది- రక్తం దారగా కారుతోంది

ఒరేయ్ దానికేదో గాయమైనట్టుంది చూడండి రక్తం ఎలా వస్తోందో పిల్లలకు రక్తాన్ని వేలితో చూపిస్తూ అన్నాను

మాకు తెలుసండి నాన్నారూ అందుకే కదా అది మేమేం చేసినా కదలకుండా పడివుంది పెద్దవాడు విజయ్ గర్వంగా చెప్పాడు

ఒక జీవి బాధతో అల్లాడుతుంటే దాన్ని యింకా హింసించి ఆనందాన్ని పొందే 'శాడిజం మనిషికి యింత చిన్న వయసులోనే అలవడుతుందా?

నోర్ముయ్ వెదవా అది దెబ్బ తగల కదలలేక పోయి దాన్ని యింకా బాధ పెడతారా? మీకు బుద్ధిలేదూ నడవండి లోపలికి నేను కోపంగ అరవడంతో బిక్క ముఖాలతో యింట్లోకి నడిచారు యిగ్గురూ

వాళ్ళంటే ఎల్లలు వాళ్ళకు బుద్ధి చెప్పకపోగా, ఆ కదలలేని కోతిని కొడుతుంటే వినోదంగా చూస్తున్నావా? శ్రీమతిని కూడ విసుక్కున్నాను

అయ్యయ్యో దానికంత దెబ్బతగిలిందని నాకు తెలియదండీ కోతులంటే నాకు బయంకదా అందుకే దూరంగా నిలుచున్నాను శ్రీమతి విచారంగా అంది

మళ్ళీ ఆ కోతి వంక చూశాను రక్తం కారుతూనే వుంది అది బాదను బరించడానికి కాబోలు కళ్ళు గట్టిగా మూసుకునివుంది

నాకు జాలేసింది యిప్పుడేం చేయాలి? దాన్ని కదిలించి ఎక్కడ ఎలా గాయ మయిందో చూస్తే? అది నన్నాపని చేయనిస్తుందా?

నిజానికి నాకు కూడ కోతులంటే బయమే కాని దాని పరిస్థితి చూస్తే ఎలంగా గాయమైనట్టుంది వెంటనే చికిత్స చేయికపోతే రక్తమంతా కారిపోయి ప్రాణాలు పోయినా పోవచ్చు మా పెరట్లో చనిపోతే అది ఒక తలనెప్పి!

ఏమైతే అయిందని దానికి దగ్గరగా వెళ్ళి మోకాళ్ళపై కూచున్నాను తాకితే దాని రియాక్షన్ ఎలా వుంటుందో గమనించడానికి చేత్తో మెల్లగా దాని తలపైనించి వీపు మీదికి నిమిరాను

నా తాకిడికి కళ్ళుతెరిచి తదేకంగా నావేపు కొంతసేపు చూచి మళ్ళీ మూసుకుంది

పట్టుకుని, యింకో చేతిని దాని కిందుగా పోనిచ్చి, రెండు చేతులతోను మెల్లగా పైకెత్తి, ఆ రక్తపు మడుగుకు దూరంగా పడుకోబెట్టాను

అప్పుడు కనిపించింది దాని వెనుక కాలి తొడలోకి చొచ్చుకు పోయిన గాజుపెంకు నేను కదిపినందు వల్ల ఆ గాయం లోంచి యింకా ఎక్కువగా రక్తం కారసాగింది

నాకు 'అయ్యో' మని పించింది పాపం! ఎలా గుచ్చుకుందో ఏమో అదే గాయం మనకి తగిలివుంటే యీ పాటికి డాక్టరు దగ్గరకు పరుగెత్తి వుండేవాళ్ళం దాన్ని కూడా డాక్టరు దగ్గరకు తీసికెళితే? యీరోజు ఆదివారం వెటరినరీ ఆస్పత్రి వుంటుందో వుండదో? అసలీ స్థితిలో దాన్ని అంతదూరం తీసికెళ్ళడం కూడ ప్రమాదమే

మొదట ఆ గాజు పెంకును బయటకు లాగితేకాని దానికి రక్తస్రావం ఆగదు ఎలాగోలా ఆపని నేనే చెయ్యదలచుకున్నాను

"విజయ్ యిలారారా" పెద్దాడ్ని కేకేశాను

అంతవరకు యింట్లోంచి నేను చేస్తున్నదంతా తొంగి చూస్తున్న వాడు నెమ్మదిగా ముందుకు వచ్చాడు

"ఫస్ట్ ఎయిడ్ కిట్ తీసుకురా త్వరగా వాడ్ని పురమాయించాను

పిల్లలకు ఎప్పుడేం అవసరమొస్తుందో నని యింట్లో అన్నీ రెడీగా వుంచుకుంటాను నేను పిల్లలందరూ వుత్సాహంగా తలొకటి పట్టుకొచ్చారు

"అది కరుస్తుందో ఏమో జాగ్రత్తండీ బాబూ" శ్రీమతి అల్లంత దూరం నుంచే తన ఆందోళన వ్యక్తపరిచింది

గాజుముక్కను ధానికాలిలోంచి లాగడమే చాల కష్టతర మయినపని. తరువాత బ్యాండేజి సులభంగా కట్టవచ్చు గాజు ముక్కను బయటకు లాగడానికి కోతిని కదలకుండా గట్టిగా పట్టుకోవాలి లాగినప్పుడు కలిగే నెప్పికి అది నానా హంగామా చేస్తే?

మగ పిల్లలిద్దరినీ దాన్ని కదలకుండా గట్టిగా పట్టుకోమన్నాను. మొదట భయపడ్డా, ధైర్యం తెచ్చుకుని ఒకడటూ, ఒకడిటూ దాన్ని గట్టిగా పట్టుకున్నారు

అపుడు అది కళ్ళు తెరిచి చూసింది నా చేతిలోని ఫోర్‌సెప్స్‌ను దానికి చూపిస్తూ 'యిపుడు నేను నీ కాలిలో నుంచి ఆ గాజు ముక్కను దీనితో లాగుతాను నువ్వు కదలకుండా వుండాలి' అని కోతితో చెబుతూ, చేతులతో యాక్షను కూడ చేసి చూపించాను

దాని కర్థమవుతుందా? ఎంతైనా మనిషి కోతి నుండే సంక్రమించాడంటారు మనలా మాట్లాడ డానికి చేత కాకపోయినా, మన భాషను అర్థం చేసుకునే శక్తి దానికుండదా?

గాజు ముక్కను ఫోర్‌సెప్స్‌తో గట్టిగా పట్టుకున్నాను దాని ముఖంలోని భావాల్ని గమనిస్తూ కొద్దిగా లాగాను ఫరవాలేదు అది నెప్పికి తట్టుకునేలానే వుంది

ఈ సారి వూపిరి బిగపట్టి బలంగా లాగాను దాన్ని అంత బాధకు గురిచేసిన ఆ గాజుముక్క పూర్తిగా బయటకు వచ్చేసింది. వెంటనే, రక్తం కారిపోకుండా గాయం దగ్గర గట్టిగా దూదితో వత్తిపట్టి, దాని తలను అనునయంగా నిమరసాగాను

అది కన్నీరు నిండిన కళ్ళతో నా వంక భక్తిగా చూస్తోంది కొంత సేపాగి దాని గాయాన్ని డెట్టాల్‌తో ముంచిన పత్తితో శుభ్రంగా తుడిచేసి, యాంటీ బయాటిక్ పౌడరుని గాయంపైన బాగా చల్లి, బ్యాండేజి గుడ్డతో నీటుగా కట్టు కట్టాను

పిల్లలూ, శ్రీమతి నేను చేస్తున్న దంతా ఎంతగా వుత్సుకతతో గమనిస్తున్నారు నేను లేచి సోపుతో చేతులు కడుక్కుంటూ "విజయ్ దానికి ఆకలిగ వుంటుంది తినడానికి ఏమయినా తెచ్చిపెట్టరా" మా వాడితో అన్నాను

వాడు పరుగున యింట్లోకి వెళ్ళి రెండు యిడ్లీలు తెచ్చి దాని కందించాడు బాగా ఆకలిగా వుందేమో అది ఆబగా తినసాగింది

'నాన్నా నిన్న మీరు తెచ్చిన బ్రెడ్ కొంచెం మిగిలిపోయింది అది కూడా తెచ్చి పెట్టనా?' రెండో వాడు వినయ్ తను కూడ దానికేదైనా యివ్వాలన్న ఆశతో అడిగాడు

'ఊ" అన్నాను చిరు నవ్వుతో

వాడు పరుగెత్తికెళ్ళి బ్రెడ్‌ని తెచ్చి ఆ కోతి ముందు నిర్భయంగా కూచుని ముక్కలు తుంచి దాని నోటి కందిస్తూ అది తింటుంటే చెప్పలేనంత సంతోషాన్ని పొందుతున్నాడు కొంత సేపటికి ముందు వీళ్ళేగా దాన్ని కొట్టి ఆనందించారు!

కడుపు నిండే సరికి దాని ముఖంలోకి కొంత కళ వచ్చింది షెడ్‌లో ఒక గోనీని వేయించి, కోతిని అలవోకగా తీసికెళ్ళి దానిపై పడుకోబెట్టి 'యీ గాయం పూర్తిగా మానేంత వరకు నువు కదలకూడదు మా పిల్లలు పెట్టింది తింటూ మూడు నాలుగు రోజులు యిక్కడే వుండు' అని చెప్పాను


అది నా చేతిని తన చేతులతో పట్టుకుని, తలవంచి నా చేతిమీద కొంతసేపు ఆనించి వదిలేసింది తనను ట్రీట్ చేసినందుకు తన కృతజ్ఞతను అలా తెలియ చేసిందేమో!

వినీతా కింద కారిన రక్తాన్నంతా శుభ్రంగా కడిగేసి ఫినాయిలుతో క్లీన్ చెయ్యమ్మా మా అమ్మాయితో చెప్పాను

దానికి పూటకింత తిండి పెడుతూండు గాయం మానగానే దాని దారిన అది వెళుతుంది" శ్రీమతితో అన్నాను

"అమ్మో నాకు భయమండీ పిల్లల చేత పెట్టిస్తాను" ఆమె బెదురుకు నాకు నవ్వు వచ్చింది

★ ★ ★ ★ ★ ★



పిల్లలు స్కూలు నుండి వచ్చిన తక్షణం ఆ కోతిచుట్టూ కూచుని దానితో లెక్కలేనన్ని కబుర్లు చెప్పేవారు దానికి 'మారుతి అని నామకరణం కూడ చేశారు

అది కూడా పిల్లలను నవ్వించడానికి తన కోతి చేష్టలన్నీ చేసేది దాని గాయానికి మళ్ళీ రెండు సార్లు కట్టు మార్చాను పూర్తిగా నయమయినా మా యింటిని వదలి పోవడానికి మారుతికి గాని, దాన్ని వదలి పెట్టడానికి పిల్లలకుగాని మనసు రాలేదు అంతగా స్నేహితులయి పోయారు వాళ్ళు'

'వీళ్ళు చదువులు కూడ మానేసి ఎప్పుడూ దానితో నే వుంటే ఎలాగండీ? శ్రీమతి అంది

నేను కూడ బాగా ఆలోచించి మారుతితో నీ గాయం పూర్తిగా మాని పోయింది నువు యిక మీ వాళ్ళ దగ్గరకు వెళ్ళి పోవచ్చు కాని అప్పుడప్పుడూ వచ్చి తప్పకుండా పిల్లలతో కాసేపు ఆడుకుని వెళుతుండాలి' అన్నాను

దానికర్థమయినట్టుంది ముఖం విచారంగా పెట్టుకుని, కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా పిల్లలను, నన్ను మార్చి మార్చి చూస్తూ అయిష్టంగా కదలి వెళ్ళి పోయింది కానీ మరుసటి రోజు సాయంత్రం పిల్లలు బడినుండి వచ్చే సమయానికి రెడీగా వచ్చేసింది తరచుగా అలా వస్తూ పిల్లలతో కాసేపు ఆడుకుని, ఏదైనా పెడితే తినేసి వెళుతోంది

పిల్లలు కూడ దాని రాక కోసం ఆతృతగా ఎదురు చూస్తూ, దానికి తినడానికి ఏదైనా యిచ్చే విషయంలో ఒకరిమీద ఒకరు పోటీ పడేవారు

అలా మారుతితో మాకంతా ఒక అనుబంధం పెరిగి పోయింది

* * * * * * *

నాగు, శేషు– యిద్దరూ దొంగలు వృత్తిరీత్యా స్నేహితులు ఒకసారి బస్టాండులో ఒకే వ్యక్తి జేబులోని పర్సును కొట్టేయడానికి యిద్దరూ ప్రయత్నించడంతో జరిగిన గొడవలలో ఒకరినొకరు బాగా కొట్టు కోవడంతో వారి స్నేహం మొదలయింది అప్పటి నుంచి విడివిడిగా కాకుండా ఒక్కటిగానే కలిసి జేబులు కొట్టడం, ఒకేచోట తినడం, ఒకచోట పడుకోవడం చేసేవారు

ఒకరి తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు మరొకరికి అర్థం కావడంతో జేబులు కొట్టడం మానేసి వ్యూహ్యు మారుతూ పకడ్బందీగా దొంగతనాలు చెయ్యడం యిపుడు వారు చేస్తున్న పని

యిది చూడు అంటూ టేబులు మీది పాత డెయిలీ పేపర్‌లోని ఒక వార్తను చూపిస్తూ అన్నాడు నాగు

శేషు దాన్ని చదివాడు నెల్లూరులో ఒక బ్యాంకు వద్ద పది హేను సంవత్సరాల వయసు గల ఒక అబ్బాయి, బ్యాంకు లోంచి డబ్బు తీసుకెళుతున్న ఒక ఆసామితో చొక్కా మీద పేడ పడిందని చెప్పి, అతను చొక్కాను చూసుకుంటుండగా డబ్బున్న సంచీతో పరారయ్యాడు పోలీసులు అతనికోసం గాలిస్తున్నారు

'అంత చిన్న పిల్లాడు చేసినంత మాత్రం మనం చెయ్యలేమా– నేను యీసారి వాడినే ఆదర్శంగా తీసుకో దలిచాను' అన్నాడు నాగు

వాళ్ళిద్దరిలో ప్లానింగ్ అంతా నాగు చేస్తాడు అతడు చెప్పింది తు చ తప్పకుండా చెయ్యడమే శేషు పని

ఒక నిముషం అతడి కళ్ళలోకి చూసి మళ్ళీ అన్నాడు నాగు 'ఇంకో వారం రోజుల్లో నెలాఖరు వస్తుంది అపుడు జీతాల కోసం డబ్బు తీసికెళ్ళ డానికి బ్యాంకుకు ఎంతోమంది వుద్యోగులు వస్తారు వాళ్ళలో ఒకడ్ని మనం ఎన్నుకోవాలి '

వుద్యోగినా నీ యిష్టం ' కొంత అయిష్టంగానే అన్నాడు శేషు ఒక వుద్యోగి జీవితాన్ని అలా నాశనం చెయ్యడం అతనికి రుచించలేదు

* * * * *

ఎందుకండీ అంత హడావిడి నిదానంగా భోంచెయ్యరాదూ? అంది శ్రీమతి

'ఈ రోజు బ్యాంకులో జీతాలకు డబ్బు డ్రా చేసుకోవాలోయ్ ఆలస్యంగా వెళితే అక్కడ రద్దీ ఎక్కువయిపోతుంది గబగబా తింటూనే అన్నాను

"మీకీ నీలి కలరు షర్టు బాగా నప్పిందండీ" నా కొత్త చొక్కా వంక మురిపెంగా చూస్తూ అంది శ్రీమతి

నీ సెలక్షను కదుటోయ్ మరి చిలిపిగా చూస్తూ అన్నాను

భోజనం అయిపోగానే సైకిలు బయటకు తీసి ఎక్కబోతుంటే 'ఆగండాగండి ఆఫీసు తాళాలు మరచి పోయారు యింట్లోంచి శ్రీమతి గట్టిగా అరిచింది

## విశ్వశక్తిని!

వాదించలేను
శోధించలేను
పరిశీలించి
పరిష్కారం చెప్పలేను
కానీ - నేనొక "లాయర్ని!"
టెస్ట్ చేయలేను
ట్రీట్‌మెంటివ్వలేను
ఆపరేషన్ చేసి
ఆరోగ్యాన్నివ్వలేను
కానీ - నేనొక "డాక్టర్ని!!"
కావ్యం వ్రాయలేను
చిత్రం గీయలేను
కష్టాలు - కన్నీళ్లు
కనుపించేలా చెప్పలేను
కానీ - నేనొక "కళాకారుణ్ణి!!!"
ఇంతకూ నేనెవర్నో తెలుసా?
ప్రపంచానికి ప్రాణవాయువును!
కష్టించి 'ధాన్యా'న్ని
పండించే కర్షకుణ్ణి!!!'

– [illegible]

తాళాలందుకుని, ఆఫీసుకు వేగంగా సైకిలు తొక్కేసి, జీతాల డబ్బు డ్రా చేసుకోవడానికి అవసరమయిన రికార్డ్సు, చెక్కు, క్యాషు బ్యాగు తీసుకుని నాతో పాటుగా బ్యాంకు డ్యూటీ పడిన సింహాచలమూ, నేనూ కలిసి రిక్షాలో బ్యాంకు చేరుకున్నాము

ఇంత కష్టపడి తొందర తొందరగా వచ్చినా నాకు పదకొండో నంబరు టోకనే వచ్చింది

"నేను టిఫిను కూడ తినలేదు ఎలాగూ ఆలస్యమవుతుంది కదా నే వెళ్ళి హోటల్లో ఏదయినా తినొస్తాను గురూ అంటూ సింహాచలం చెక్కేశాడు

రద్దీగా వుందని, శనివారం కావడంతో, పేమెంటుకు యింకో కౌంటరు కూడ ఏర్పాటు చెయ్యడంతో, నా వంతు త్వరగా వచ్చేసింది

డెబ్బయి వేలు అన్నీ వంద రూపాయల కట్టలే లెక్క పెట్టుకుని క్యాషు బాగులో సర్ది, జిప్ లాగేసి, చంకలో పెట్టుకుని, బ్యాంకులో నించి బయట పడ్డాను

బయట చెట్టుకింద జనం గుంపులుగా చేరి వారి కిష్టమయిన విషయాల గురించి చర్చించు కుంటున్నారు సింహాచలం కోసం కళ్ళతోనే వెదుకుతూ, ముందుకు అడుగు లేస్తున్నాను

. అదేమిటి మాష్టారూ చొక్కా ఎనకంతా అలా చిరిగిపోయింది ఎవరో మనిషి నన్ను వెనుకనించి దాటుకుంటూ వచ్చి నాతో అన్నాడు

'అరెరే కొత్త చొక్కా చిరిగి పోయిందా రిక్షాలో వచ్చేటపుడు ఏదైనా మేకుకి తగిలిందేమో" అంటూ చంకలోని సంచిని కాళ్ళకు ఆనించి కింద పెట్టి, రెండు చేతులతోను నా వీపు బాగాన్ని తాకడానికి ప్రయత్నం చేస్తున్నాను

అంతలో ఆ మనిషి మెరుపులా వంగి ఆ సంచిని చేజిక్కించుకుని, పరుగున వెళ్ళి, దగ్గరలోనే ఒక చెట్టు క్రింద స్టార్టు చేసుకుని రెడీగా వున్న మోటారు సైకిలు వెనక సీట్లో ఒక్క దూకుతో కూచోగానే, అది అతి వేగంగా ముందు కురికి కదలిపోయింది

నేను చైతన్యం కోల్పోయి, నిశ్చేష్టుడనై జరుగుతున్నదంతా ఒక కలలా చూస్తున్నాను

దీన్ని చూచిన కొంతమంది పరుగున నా దగ్గరకు వచ్చి "ఎవరండీ వాళ్ళు? ఏం జరిగింది?" అని నన్ను కదిపి ప్రశ్నించడంతో యీ లోకంలోకి వచ్చాను

"దొంగలు దొంగలు ఆఫీసు డబ్బంతా దోచుకు పోయారు పట్టుకోండి. పట్టుకోండి" పిచ్చిగా అరుస్తున్నాను నోరు కూడ సరిగా పెగలడం లేదు నాకు జరిగింది అర్థమయ్యేసరికి గుండెల్లో దడ, వంట్లో వణుకు పుట్టుకొచ్చింది ముచ్చెమటలు పోస్తున్నాయి

"ఏమిటి విశ్వం ఏమయింది?" సింహాచలం పరుగు పరుగున వచ్చి ఆందోళనగా అడుగుతున్నాడు

"కొంప మునిగిందయ్యా వాళ్ళెవరో మోసం చేసి

క్యాషు బాగు తీసికెళ్ళిపోయారు యిప్పుడేం చెయ్యాలయ్యా?" వుప్పెనలా వచ్చిన దుఃఖం ఆ తరువాత నన్ను మాట్లాడనివ్వలేదు

అక్కడ చుట్టుకున్న వాళ్ళంతా సింహాచలానికి జరిగింది వివరించారు అతనికి కూడ గుండె జారిపోయింది

"విశ్వం వెంటనే పోలీసుస్టేషనుకెళ్ళి రిపోర్టిద్దాం రా" అంటూనే పరుగెత్తుకెళ్ళి అక్కడున్న రిక్షా ఒకదాంట్లో ఎగిరి కూచున్నాడు నేను కూడ అసంకల్పితంగా అతన్ని అనుసరించాను

రిక్షా పోతోంది కాని నాకేమీ తెలియడంలేదు దీని పర్యవసానం ఎలా వుంటుందో, జీవితం ఏమయిపోతుందోనన్న ఆలోచన నన్ను పూర్తిగా అశక్తుడ్ని చేసేసింది

స్టేషనులో కూడ సింహాచలమే అంతా వివరించాడు యస్ ఐ వెంటనే జీపు కోసం ఫోను చేసి అది వచ్చే లోపల ఎన్నో ప్రశ్నలతో జరిగింది నా ద్వారా కూడ తెలుసుకున్నాడు జీపు వచ్చింది నలుగురు పోలీసులు తుపాకులతో వెనుక కూచున్నారు జీపు శరవేగంతో బ్యాంకును, అక్కడ గుమికూడిన గుంపును దాటి ఆ మోటారు సైకిలు పోయిన దిశగా పరుగు తీసింది

నాకు ఒకటే ఆలోచన పోయిన డబ్బు తిరిగి దొరుకుతుందా? నా వుద్యోగం నాకు దక్కుతుందా? నేను చేయగలిగింది ఒక్కటే! దేవుడ్ని ప్రార్థించడం "నన్నీ ఆపద నించి రక్షించు స్వామీ సకుటుంబంగా నిన్ను దర్శించి తలనీలా లిచ్చుకుంటాం ప్రభూ" మనసులో అనుక్షణం తిరుమలేశుని ప్రార్థిస్తూ కూచున్నాను

★ ★ ★ ★ ★

జరిగినదంతా తన బృందంతో కలిసి బ్యాంకు ఆవరణలోని చెట్టు మీద ఆడుకొంటున్న మారుతి చూసింది

విశ్వం కన్నీళ్ళతో, ఆందోళనగా అరుస్తుంటే చూసిన మారుతికి తనను ఆపద నుండి కాపాడి ప్రేమగా, ఆప్యాయంగా చూసుకొనే అతనికి ఏదో ద్రోహం జరిగింది మోటారు సైకిలు మీద పారిపోయిన వారి వెంటపడి, ఎలాగైనా వాళ్ళు తీసుకెళ్ళిన సంచిని దక్కించుకుని దాన్ని తిరిగి అతనికి చేర్చడం తన తక్షణ కర్తవ్యంగా తోచింది

వెంటనే మారుతి రోడ్డు మీద మోటారు బైకు వెళ్ళిన వైపు తన శక్తికొద్దీ వేగంతో పరుగులు తీసింది రోడ్డు మీది జనమంతా అంత వేగంగా పరుగెత్తుతున్న ఒక కోతిని విడ్డూరంగా చూస్తున్నారు

అలా పరుగెత్తి, పరుగెత్తి తనలో అలసట మొదలయ్యేసరికి, యీ వేగంతో తను వాళ్ళను అందుకోలేనని తెలిసింది మారుతికి ప్రత్యామ్నాయం కోసం అటూ యిటూ చూసింది వెనకనించి అతి వేగంగా వస్తున్న ఒక లారీ దాని కంటబడింది. ఆ లారీని తన దగ్గరకు రానిచ్చి, ఒక్క గెంతులో వెనక నుంచి దానిపైకి దూకి, ఆత్రంగా రోడ్డు వైపే చూస్తూ, తన దృష్టినంతా ఆ మోటారు సైకిలు కోసమే కేంద్రీకరించింది

★ ★ ★ ★ ★

శేషు మోటారు సైకిలును వేగంగా పోనిస్తున్నాడు టవును పొలి మేరలు దాటేవరకు వున్న టెన్షను, గుండె దడ యిపుడు కొద్దిగా తగ్గింది తేలికగా వూపిరి పీల్చుకొన్నాడు వెనుక క్యాషు బ్యాగును రెండు చేతులతో గట్టిగా కడుపుకు ఆనించుకుని కూచున్నాడు నాగు —

"అబ్బ యింత యీజీగా బయట పడతామనుకోలేదు గురూ" నాగుకు వినబడడానికి గట్టిగా అరిచాడు శేషు

"అపుడే ఏమయింది మనప్లాను ప్రకారం అంతా సవ్యంగా జరిగితే రేపీపాటికి బొంబాయికి సగం దూరంలో ఉంటాం నువు నేను చెప్పిన సమయానికి రేణిగుంట స్టేషను చేరేలా చూడు" అన్నాడు నాగు

శేషు యింకా వేగం పెంచాలని ప్రయత్నించడంతో గడగడమని శబ్దం చేస్తూ ఆగిపోయింది మోటారు సైకిలు

"డామిట్‌నువ్వే పనీ సక్రమంగా చెయ్యవు కదా" శేషుని కోపంగా తిడుతూ కిందికి దిగాడు నాగు

శేషు కూడ దిగి ట్రబుల్ ఏమిటోనని పరీక్షించాడు

"తొందరగా చూడు పోలీసులకు పట్టుబడితే జీవితాంతం జైలే గతి" వెనక్కి తిరిగి రోడ్డు వంక చూస్తూ నర్వస్‌గా అన్నాడు నాగు

దాన్ని బాగు చేసేసరికి అయిదు నిమిషాలు పైనే పట్టింది

"జాగ్రత్తగా పోనీ ఈసారి ఆగిపోయిందంటే మన పని ఆఖరే" హెచ్చరించాడు నాగు

స్టార్టు చేసి, నాగు వెనక కూచున్న తర్వాత రివ్వున ముందు కురికించాడు శేషు

నాగు అప్పుడప్పుడు వెనక్కి తిరిగి చూస్తున్నాడు

"ముప్పయి నిముషాలేగా అయింది అపుడే మనం ఎంత దూరం వచ్చేశామో చూడు పోలీసులంత త్వరగా ఎక్కడ బయలుదేరుతార్లే" నమ్మకంగా అన్నాడు శేషు

కొంతసేపటికి ఒక లారీ వెనక నించి వేగంగా వస్తుండడం గమనించారు యిద్దరూ

"సైడ్ యిచ్చేయి వాడు పోనీ" చెప్పాడు నాగు అక్కడొక టర్నింగు వచ్చింది మోటారు సైకిలును స్లో చేసి లారీని పొమ్మన్నట్లు చేతితో సైగ చేశాడు శేషు

లారీ వారిని దాటిపోయింది

ఆ లారీ నుండి ఒక కోతి కిందికి గెంతడం వారిద్దరూ గమనించారు

"మీ ఫ్రెండు గురూ" నవ్వుతూ అన్నాడు శేషు

ఆ కోతి రోడ్డుమీదే నిలబడి వుంది

మోటారుసైకిలు తన దగ్గరకు రాగానే అది ఎగిరి శేషు మీదకు దూకి, తన రెండు చేతులకున్న వాడి గోళ్ళతో శేషు ముఖాన్ని తన శక్తినంతా వుపయోగించి గీరేసింది

"అమ్మా" అన్న ఆర్తనాదంతో తన రెండు చేతులతోను ముఖాన్ని కప్పుకున్నాడు శేషు

అదుపు తప్పిపోయిన మోటారుసైకిలు రోడ్డును వదలి, ఎడమ వైపున వున్న ఓ పెద్ద చింతచెట్టుకు గుద్దుకుంది చేతులతో ముఖం దాచుకుని వున్న శేషు తల ఆ తాకిడికి టప్‌మంటూ పగిలిపోయింది


నాగు వెనక్కు విరుచుకు దూరంగా పడిపోయాడు ఆ పట్నంలో కాలు బెణికింది లేవడానికి ప్రయత్నిస్తుండగా, ఎదురుగా రౌద్రంగా, ప్రళయకాల కాళిలా రెండు కాళ్ళ మీద నిలబడి వున్న ఆ కోతి కనిపించింది

ఆ కోతికి ఎందుకింత కోపం వచ్చిందో, ఎందుకు తమ మీద దాడి జరిపిందో నాగుకు అర్థం కాలేదు

శేషు కోసం కళ్ళతోనే వెదికాడు చెట్టు దగ్గర నుగ్గు నుగ్గయిన మోటారుసైకిలు కింద అచేతనంగా పడివున్నాడు శేషు అతడి

---

## రాజకీయ రంగంలోకి విలన్ త్యాగరాజు!



తెలుగు చలన చిత్ర రంగంలో విలన్‌గా స్థానం సంపాదించిన త్యాగరాజు చిత్ర రంగానికి గుడ్‌బైకొట్టి రాజకీయ రంగంలోకి ప్రవేశించాలనుకుంటున్నాడట 300 చిత్రాల్లో నటించిన ఈ నటుడు అధికారంలో వున్న పార్టీలో చేరతాడట కేంద్రంలో అధికారంలో వున్న పార్టీనా లేక రాష్ట్రంలో అధికారంలో వున్న పార్టీనా అంటే అందుకు సమాధానం చెప్పటం లేదట మరో రెండు నెలల్లో సస్పెన్స్‌ను క్లియర్ చేస్తానంటున్నాడు సనిమాలు కరువైపోయాయేమో? రాజకీయాల్లో చేరితేలాభసాటిగా వుంటుందనుకున్నాడు కాబోలు! కానీయండి ఎవరికి ఎక్కడ. ఎంత ప్రాప్తమో?

మ దుగులా విస్తరిస్తోంది.

శేషు చచ్చిపోయాడా? నాగుకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. లేవడానికి మళ్ళీ ప్రయత్నించాడు.

ఆ కోతి ముందుకు దుమికి క్యాషు బాగును పట్టుకుని వున్న నాగు కుడి చేతిని గట్టిగా కరిచేసింది.

"అబ్బా" బాధగా అరుస్తూ సంచిని వదిలేశాడు. ఆ కోతి అంతటితో వూరుకోలేదు. నాగును లేవనీయకుండా అందిన చోటల్లా గోళ్ళతో రక్కుతూ, పళ్ళతో కొరుకుతూ అతని శరీరాన్నంతా రక్తసిక్తం చేసేసింది.

నాగుకు ఆ గాయాలు విపరీతంగా మంట పెడుతున్నాయి. కళ్ళు భైర్లు కమ్ముతున్నాయి. గట్టిగా మూసుకున్నాడు.

మళ్ళీ కళ్ళు తెరిచేటప్పటికి ఎదురుగా ఆ కోతిగాని, క్యాషు బ్యాగుగాని కనిపించడంలేదు.

చుట్టూ పరికించి చూశాడు. దూరంగా ఒక పొద దగ్గర ఆ కోతి నిలబడి వుంది. బ్యాగు కనిపించడంలేదు.

బ్యాగునేం చేసింది అది? అసలు ఆ కోతికి దానితో ఏం పని? అయోమయంగా వుంది అతడికి.

తన శక్తినంతా కూడదీసుకుని లేవడానికి ప్రయత్నించాడు. కానీ అణుమాత్రం కదలలేక పోయాడు.

నెప్పితో శరీరం ఎలవిల్లాడిపోయింది. వళ్ళంతా రక్తం ధారలుగా కారిపోతోంది. గుండెల్లో ఏదో నెప్పి వుప్పెనలా అలుముకుంటోంది.

దూరంగా ఏదో వాహనం వస్తున్న చప్పుడు వినిపించింది. సహాయం కోసం అరిస్తే?

నాగు అతి కష్టంమీద నోరు తెరిచేలోపలే పోలీసు జీపొకటి రోడ్డు మీద హఠాత్తుగా ఆగింది.

"ఏదో ఆక్సిడెంటయినట్టుంది. దిగి చూడండి" అంటూ తాను కూడ దిగుతున్న యస్. ఐ. కనిపించాడు నాగుకి.

"నా పని అయిపోయింది" విరక్తిగా అనుకున్నాడు నాగు. తన ప్లానంతా నాశనం చేసిన కోతి రూపం అతని కళ్ళ ముందు కదిలింది. ఎంతో ప్రయాసతో తన ఎడమ చేతిని కదిలించి తన పాంటు జేబులోంచి కత్తిని బయటకు తీసి, గురి చూసి, కసిగా, బలంగా ముందుకు విసిరాడు.

ఆ కత్తి తన గమ్యం చేరిందో లేదో కూడ చూడకుండా అతని తల పక్కకి వొరిగిపోయింది!

* * * * *

"ఛ. యిదొక ఆటంకమా" అనుకుంటూ నేను కూడ జీపులోంచి కిందకు దిగాను.

"మోటారు బైకు చెట్టుకు గుద్దేసింది సార్. యిద్దరూ చచ్చినట్టున్నారు. ఒకడి ముఖం మీద, యింకోడి వళ్ళంతా ఏదో రాక్షసి రక్కేసినట్టు భయంకరంగా వుంది సార్" ఒక పోలీసు తిరిగి వచ్చి యస్. ఐ. కి రిపోర్టిచ్చాడు.

నేను ముందుకు వొంగి చూశాను. "సార్ అదే బైకులాగుంది సార్" అంటూనే ముందుకు పరిగెత్తాను. చెట్టు కింద పడివున్న మనిషిని, దూరంగా పడివున్న యింకొకడిని చూశాను.

"సందేహం లేదు వాళ్ళే సార్" ఆత్రంగా క్యాషు బ్యాగు కోసం చుట్టూ వెదుకుతున్నాను. ఎక్కడా కనిపించలేదు. రోడ్డు మీద వెళ్ళే వాళ్ళెవరైనా చూసి తీసికెళ్ళి పోయారా?

నిస్సత్తువ ఆవహించింది నన్ను.

యింతలో "కిచ్ కిచ్ కిచ్ కిచ్" అన్న సుపరిచిత శబ్దం వినిపించింది ఎక్కడి నుంచో. ఆశ్చర్యంతో చుట్టూ చూసాను.

ఒక పొద దగ్గర పడి వుంది మారుతి. దాని శరీరంలో కి కత్తి దిగబడి వుంది!

నన్ను రమ్మంటూ మెల్లగా చేయి వూపుతోంది. పరుగెత్తుకుంటూ దాని దగ్గరకు వెళ్ళి "నువ్విక్కడకు ఎలా వచ్చావు మారుతీ. యీ ఘోరమేమిటి?" కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా అడిగాను.

మారుతి సమాధానంగా నా చేతిని పట్టుకుని ఆ పొద లోపల చూపించింది. అక్కడ క్యాషు బ్యాగు పడివుంది. ఆత్రంగా దాన్నందుకుని తెరిచి చూశాను. డబ్బంతా అలాగే భద్రంగా వుంది.

కన్నీళ్ళతో ఆప్యాయంగా, కృతజ్ఞతగా దాని చేయందుకున్నాను. నా చేతిలో నిర్జీవంగా వేలాడింది మారుతి చేయి!

మారుతి నా జీవితాన్ని కాపాడిందా? నేను చేసిన చిన్న వుపకారానికి తన ప్రాణాల్ని బలిపెట్టి నన్నాదుకుందా? అంతులేని దుఃఖం నాలోంచి తన్నుకొచ్చేసింది.

ఈ తతంగమంతా అర్థం కాకుండా నోళ్ళు వెళ్ళబెట్టుకుని చూస్తున్నారు వాళ్ళంతా. మారుతితో మాకు ఏర్పడిన అనుబంధాన్ని వ్యథతో పూడుకు పోతున్న గొంతుకతో వారికి వివరించాను.

"మనం బ్యాంకుకి వెళ్ళినప్పుడు అక్కడ వున్న చెట్ల మీద చాల కోతులున్నాయి విశ్వం. అందులో మారుతి కూడ వుండి నీకు జరిగిన దాన్ని కళ్ళారా చూసి వీరి వెంట పడివుండాలి. అయితే అది యింత దూరం అంత త్వరగా ఎలా రాగలిగింది" సాలోచనగా అన్నాడు సింహాచలం.

"ఎనీ వే యూ ఆర్ వెరీ లక్కీ. యిక వెళదాం రండి. నేను మిమ్మల్ని వదిలి పెట్టేసి మా టీమునంతా తీసుకు రావాలి. బైది బై దీన్ని మీ ప్రసక్తి లేకుండా వట్టి ఆక్సిడెంట్ కేసుగానే బుక్ చేసుకుంటాను" అన్నాడు యస్. ఐ. మారుతి కథ ఆయన్ని కూడ బాగా కదలించి వేసినట్టుంది.

"థాంక్యూ వెరీ మచ్ సార్" సింహాచలం ఆయన చేతులు పట్టుకుని వినయంగా అన్నాడు.

నేను కూడ రెండు చేతులతోనూ నమస్కరించి "మీ సహాయాన్ని నేనీ జన్మలో మరచిపోను సార్" గద్గద స్వరంతో అన్నాను.

"నేనేం చేశానండీ. మీ మారుతే మిమ్మల్ని కాపాడింది" అని ఆయన జీపుకేసి నడిచాడు.

నేను కొత్త చొక్కాను విప్పేసి, అందులో మారుతిని భద్రంగా చుట్టుకుని, నా వడిలో పెట్టుకొని జీపులో కూచున్నాను.

జీపు కదిలింది.

మారుతిని పోగొట్టుకున్న దుఃఖాన్నించి నా పిల్లలను ఎలా సమాధానపరచగలను? తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి మా కుటుంబాన్ని రక్షించిన మారుతికి మా కృతజ్ఞతనెలా తెలుపుకోగలము? ●

## రాజకీయాల్లో షబ్నా



హిందీ చలన చిత్ర చరిత్రలో తనకంటూ ఒక అమూల్యమైన స్థానాన్ని ఏర్పరచుకున్న షబ్నా ఆజ్మీ రాజకీయాల్లోకి ప్రవేశించింది.

సంఘ సంస్కర్తగా అనేక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే షబ్నా కమ్యూనిస్టు పార్టీలో చేరిపోయింది. చేరిపోవటమేమిటి.... వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఉత్తర ప్రదేశ్ నుంచి సి. పి. ఐ. తరఫున పోటీ చేస్తుందట కూడా.

ప్రఖ్యాత కవి కైఫీ ఆజ్మీ కుమార్తె అయిన షబ్నాకు మరి రాజకీయ పెద్దల ఆశీస్సులు ఎంతవరకు లభిస్తాయో, ఎన్నికల్లో విజయానికి అవి ఎంతవరకు తోడ్పడతాయో వేచి చూడాలి!